మార్చి నెలాఖరులో అందుబాటులోకి మలక్‌పేట ఆర్‌యూబీ మూడో దారి

● ఎమ్మెల్యే అహ్మద్ బలాల



ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల, రైల్వే ఇంజనీరింగ్ అధికారులు

చాదర్‌ఘాట్. ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ, దక్షిణ మధ్య రైల్వే అధికారుల సమన్వయంతో సుమారు రూ.12కోట్లతో నిర్మిస్తున్న మలక్‌పేట ఆర్‌యూబీ మూడో దారి మార్చి నెలాఖరులో అందుబాటులోకి రానుందని ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. ఈమేరకు ఆయన దక్షిణ మధ్య రైల్వే ఇంజనీరింగ్ విభాగం ఈఈ కరుణ, ఎస్‌ఎస్‌ఈ షఫీ, జీహెచ్‌ఎంసీ హెచ్‌ఆర్‌డీసీఎల్ ఈఈ మురళీకృష్ణ, డీఈ రాజారాం, టౌన్ ప్లానింగ్ ఈఈ ఇర్షాద్, మలక్‌పేట సర్కిల్-6 డిప్యూటీ ఈఈ ప్రదీప్, ఏఈ మల్లికార్జున్‌లతో బుధ, గురువారాల్లో సమీక్ష నిర్వహించి పరిశీలించారు. మలక్‌పేట ఆర్‌యూబీ మూడో దారి నిర్మాణ పనుల కారణంగా మూతపడిన వినాయకవీధి, మూసానగర్, రసూల్‌పుర బస్తీలదారులను పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు.

స్టీల్ బ్రిడ్జి పనులను పరిశీలించిన గ్రేటర్ కమిషనర్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ రోనాల్డ్ రోస్

సైదాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ఫైర్‌స్టేషన్ నుంచి సంతోష్‌నగర్ చౌరస్తా వరకు కొనసాగుతున్న స్టీల్ బ్రిడ్జి ఫ్లైఓవర్ నిర్మాణ పనులను గురువారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ పరిశీలించారు. పనుల పురోగతిని ఇంజనీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. పనులు మరింత వేగవంతం కావాలని సూచించారు. జోనల్ కమిషనర్ రవికిరణ్, ప్రాజెక్టు సీఈ దేవానంద్, ఎస్ఈ దత్తుపంత్, సీసీపీ రాజేంద్రప్రసాద్‌నాయక్ పాల్గొన్నారు.

'ఆలయం మీదుగా స్టీల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టవద్దు'

సైదాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి(ఫ్లైఓవర్) నిర్మాణం హనుమాన్ ఆలయం మీదుగా చేపట్టవద్దంటూ బీజేపీ నేతలు నిరసన వ్యక్తం చేశారు. గురువారం ఉదయం గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రోస్ సైదాబాద్‌లో బ్రిడ్జి పనుల పరిశీలనలో తమకు కలిసే అవకాశం ఇవ్వకుండా నామమాత్రంగా పర్యటించి వెళ్లారని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్ ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొత్త కాపు రవీందర్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వినోద్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యుడు వినయ్‌కిషోర్ యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు తట్టి అన్నారంలోని శ్రీలలితా భువనేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో వల్లీ దేవసేనా సమేత నాగసుబ్రహ్మణ్యస్వామి, కాలభైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గురువారం వేద పండితులు ఆలయంలో ప్రత్యేక పూజ, హోమం నిర్వహించిన అనంతరం విగ్రహాల ప్రతిష్ఠ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కూకుట్లపల్లి మహేందర్, అల్లూరి శివ విష్ణుబ్రహ్మ, రావిరాల పరమేశ్వర శాస్త్రి, మహేష్, వినోద్, హనుమంతరావు, అమర్‌నాథ్, నరేందర్ పాల్గొన్నారు.

ప్రత్యంగిరా ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఎల్బీనగర్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠం ప్రత్యంగిరా పరమేశ్వరి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి విశేషమైన 18 రకాల ద్రవ్యాలతో అభిషేకం చేశారు. విశ్వాస్ గ్రూప్ ప్రతినిధి గాయత్రి ఫణీందర్ ఆధ్వర్యంలో మహిళలు లలిత విష్ణు సహస్రనామ పారాయణం, కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక కార్పొరేటర్ రాధధీరజ్‌రెడ్డి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్, విఠల్‌శర్మ, చాణక్యశర్మ, మునిపల్లె సువర్ణలత, అరుణ, హేమ, సాయికుమార్, హేమంత్, గోపాలకృష్ణ, శ్రీపతి పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ గణేష్‌నగర్ కాలనీలోని శ్రీలక్ష్మీగణపతి దుర్గాభవానీ సమేత మల్లికార్జున స్వామి ఆలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్‌యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానికులు మధుసూదన్‌రెడ్డి, కాలనీ అసోసియేషన్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కనుల పండువగా సాయిబాబా పవిత్రోత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ షిరిడీ సాయి సంస్థాన్‌లో సాయిబాబా పవిత్రోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. పవిత్రోత్సవాల చివరి రోజు గురువారం కలశపూజ, ఆవాహిత దేవతా హోమాలు, నీరాజన మంత్ర పుష్పం, మహాదాశీర్వచనం, జయాది హోమాలు, అష్టోత్తర కలశాభిషేకం, అఖండ బలి, శిఖరాభిషేకం, నక్షత్రహారతి, ఆలయ సంప్రోక్షణ తదితర పూజ కార్యక్రమాలను పండితుల మంత్రోచ్చారణల నడుమ ఘనంగా నిర్వహించారు. సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్ గుండా మల్లయ్య దంపతులు, మాజీ అధ్యక్షులు పూర నర్సింహగుప్తా దంపతులు, కోశాధికారి శంకర్‌రావు దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

చంపాపేట, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ రాజిరెడ్డినగర్ కాలనీలోని సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మీర్‌పేట ప్రశాంత్‌హిల్స్‌కు చెందిన భక్తుడు నారాయణరెడ్డి, పూర్ణిమ దంపతులు స్వామి వారికి పూజలు చేసి 500మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అనంతలక్ష్మి, చంపాపేట ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బచ్చు మహేష్‌గుప్తా, భక్తులు జివి రాములు, సుదర్శన్, చంద్రశేఖర్, రవీందర్‌గుప్తా, మధు, సాయికృష్ణ, సాయిరాం పాల్గొన్నారు.

రాచకొండలో 14మంది ఇన్‌స్పెక్టర్‌లు మల్టీజోన్‌కు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): అడ్మినిస్ట్రేటివ్ విధుల్లో భాగంగా రాచకొండ కమిషనరేట్‌లో పనిచేస్తున్న 14 మంది ఇన్‌స్పెక్టర్‌లను మల్టీజోన్ 2కు అటాచ్ చేస్తూ సీపీ తరుణ్‌జోషి గురువారం ఆదేశాలు జారీ చేశారు. యాదాద్రి పీసీఆర్ ఆర్. నిరంజన్, కుషాయిగూడ ఎస్‌హెచ్‌ఓ ఎం.మహేష్, ఘట్‌కేసర్ ఎస్‌హెచ్‌ఓ జి.గోవర్ధనగిరి, కుషాయిగూడ డీఐ బి. సాయిప్రకాష్‌గౌడ్, వనస్థలిపురం డీఐ బి. వెంకటయ్య, వనస్థలిపురం ట్రాఫిక్ 1 ఎల్. బాలుచౌహాన్, కుషాయిగూడ ట్రాఫిక్ పి.రఘువీర్‌రెడ్డి, చౌటుప్పల్ ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్.సైదులు, ఎస్‌ఓటీ 2 ఈ. జంగయ్య, పి. సైదులు, సీసీఎస్ ఎల్బీనగర్ ఎన్. జయరాం, కె. సత్యనారాయణ, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ టి. కిరణ్‌కుమార్ మల్టీజోన్ 2 ఐజీపీకి వెంటనే రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

5 నుంచి గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు

నల్లకుంట, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మార్చి 5 నుంచి 12వ తేదీ వరకు కొనసాగుతుందని సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్‌లు తెలిపారు. గురువారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు స్థానికంగా కనీసం పదేళ్లు పనిచేసిన సర్వీస్ ఆధారాలతోపాటు ప్రస్తుతం జర్నలిస్టుగా పనిచేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం (ఐడీకార్డు, అక్రిడిటేషన్ కార్డు లేదా సంస్థ నుంచి అపాయింట్‌మెంట్ లెటర్)తో పాటు స్థానిక నివాస ధ్రువీకరణ (ఆధార్ కార్డు లేదా గ్యాస్ బిల్, కరెంట్ బిల్లు), రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు దరఖాస్తు ఫారానికి జత చేయాలని పేర్కొన్నారు. వీటితోపాటు ది గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేదా గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ ఎంఏసీ హౌసింగ్ సొసైటీ పేరిట రూ.1050 బ్యాంకు డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ) తీసి దరఖాస్తు ఫారానికి జతచేయాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలు వనస్థలిపురంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపంలో ఉన్న టీవీ కాలనీ ఫేస్- 4, ప్లాట్ నంబర్ 198లో గల సొసైటీ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు లభిస్తాయని తెలిపారు అర్హులైన జర్నలిస్టులు సభ్యత్వానికి కావాల్సిన సర్వీస్ ఆధారాలు, డీడీ తీసుకుని వచ్చి దరఖాస్తు నింపి సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 9100933723, 9393353519లలో సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

అవిశ్వాసం ఫెయిల్ కావొద్దు..!

● బీఆర్‌ఎస్‌ను తుడిచి పెట్టేయాలి
● మీర్‌పేట్ కార్పొరేటర్లతో మాటాముచ్చటలో 'తీగల'
● స్థానిక సమస్యలపై చర్చ



కార్పొరేటర్లతో, మహిళా కార్పొరేటర్ల భర్తలతో ముచ్చటిస్తున్న తీగల

సరూర్‌నగర్, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని పలువురు కాంగ్రెస్ కార్పొరేటర్లు, మహిళా కార్పొరేటర్ల భర్తలతో మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి గురువారం మాటా ముచ్చట నిర్వహించారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఆయనను సదరు నేతలు మర్యాదపూర్వకంగా కలువగా, వారితో ఆయన కాసేపు పిచ్చాపాటీ మాట్లాడారు. కార్పొరేషన్‌లోని డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా తీగల మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, దీనిపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి వచ్చే ఎంపీ ఎన్నికల్లో పార్టీకి ఓటు బ్యాంకు పెరిగేలా చూడాలని వారికి సూచించారు. స్థానిక సమస్యలపై దృష్టి పెట్టాలని, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాటల గారడీతోనే కాలయాపన చేసిందని, ఆ పార్టీలో వాక్‌స్వాతంత్ర్యం కూడా కరువయిందని విమర్శించారు.

అవిశ్వాసం నెగ్గాల్సిందే..?!

మీర్‌పేట్ మేయర్‌పై 31 మంది కార్పొరేటర్లు ప్రవేశ పెట్టిన అవిశ్వాసం ఎట్టి పరిస్థితుల్లోనూ నెగ్గాల్సిందేనని, అది ఫెయిల్ కాకూడదని తీగల కార్పొరేటర్లతో వ్యాఖ్యానించినట్టు తెలిసింది. అవసరమైతే బీఆర్ఎస్‌లోని ఇతర సభ్యుల మద్దతు సైతం కూడగట్టాలని, బలాన్ని మరింత పెంచుకుని అవిశ్వాసం నెగ్గడానికి చర్యలు తీసుకోవాలని ఆయన వారికి సూచించినట్టు సమాచారం. అవినీతి, కుంభకోణాల్లో కూరుకుపోయిన బీఆర్ఎస్‌ని తుడిచిపెట్టేయాల్సిన అవసరం ఉన్నదని, ఆత్మగౌరవం చంపుకుని ఆ పార్టీలో కొనసాగుతున్న నాయకులు, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్‌లోకి రావాలని ఆయన పేర్కొన్నట్టు తెలిసింది. మేయర్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోవడానికి బీఆర్ఎస్ నేతలు చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని, ఇది సక్సెస్ అయిన తర్వాత డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టే అంశంపై చర్చిద్దామని తీగల వ్యాఖ్యానించినట్టు తెలిసింది.



సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



షాపింగ్ మాల్‌లో సందడి చేస్తున్న సినీతారలు ఆషిక రంగనాథ్, అమృత అయ్యర్

హయత్‌నగర్‌లో సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

హయత్‌నగర్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లో విజయవాడ జాతీయ రహదారి వెంట నూతనంగా నెలకొల్పిన సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను గురువారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, సినీతారలు నా సామిరంగ ఫేమ్ కథనాయిక కుమారి ఆషిక రంగనాథ్, హనుమాన్ ఫేమ్ కథనాయిక కుమారి అమృత అయ్యర్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. సినీతారలు ఆషిక రంగనాథ్, అమృత అయ్యర్‌లు వస్తున్నారని తెలుసుకున్న జనం పెద్ద ఎత్తున షాపింగ్ మాల్ ప్రారంభానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర శివారులో ఇంత పెద్ద షాపింగ్ మాల్ రావడం అదృష్టం అన్నారు. షాపింగ్ మాల్‌లో అనేక రకాల డిజైన్ల వస్త్రాలు ఉన్నాయని ప్రతి ఒక్కరూ షాపింగ్ మాల్‌ను సందర్శించి ఇష్టమైన వాటిని కొనుగోలు చేయాలని కోరారు. అనంతరం కష్టమర్లతో సెల్ఫీ తీసుకున్నారు. కార్యక్రమంలో సీఎంఆర్ టెక్స్‌టైల్ అండ్ జూవలరీ సంస్థల చైర్మన్ మావూరి వెంకటరమణ, ఎండీ మోహన బాలాజీ, జీఎం ఎం. లింగమూర్తి పాల్గొన్నారు.

మోదీ గ్యారెంటీ అంటే అభివృద్ధి

● కాంగ్రెస్ గ్యారెంటీ అంటే అవినీతి, కుటుంబ పాలన
● మజ్లిస్ విషయంలో బీఆర్ఎస్ బాటలో కాంగ్రెస్
● మలక్‌పేట విజయసంకల్ప యాత్రలో ఎంపీ లక్ష్మణ్



మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, పక్కన కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి, అరుణరెడ్డి, సంరెడ్డి సురేందర్‌రెడ్డి, సుభాష్‌చందర్జీ

చాదర్‌ఘాట్. ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఉన్న నిరుపేద కుటుంబాలకు ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చే గ్యారెంటీ అంటే అభివృద్ధికి మారుపేరు, చేసి చూపించే దిశాదక్షుడు, అదే కాంగ్రెస్ గ్యారెంటీ అంటే అవినీతి, కుటుంబ పాలన వీటిపై ప్రజలు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ వైపు మొగ్గు చూపేందుకు సిద్ధంగా ఉన్నారని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. భాగ్యనగర్ జిల్లాలోకి ప్రవేశించిన బీజేపీ విజయ సంకల్ప యాత్ర బుధవారం రాత్రి దిల్‌సుఖ్‌నగర్‌లో ముసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ గడచిన పదేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రతి సంవత్సరం ఏదో ఒక కుంభకోణం వెలుగుచూసేదని, మోదీ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ప్రతి ఏటా ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంతో అడుగు ముందుకు వేస్తుందని వివరించారు. అవినీతి, కుంభకోణాలకు తావులేకుండా ఆ సొమ్ముతోనే కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేయడానికి ఇందుకు నిదర్శనమన్నారు. మొన్నటి వరకు ఓట్ల కోసం బీఆర్ఎస్ మజ్లీస్‌ను చంకలో పెట్టుకుంటే నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా తిరిగి అదేబాటలో పయనిస్తుందన్నారు. వారంటీ లేని గ్యారెంటీ హామీలను అమలు చేయడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆయన విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి మద్దతునిచ్చి మరోసారి ప్రధాని మోదీకే మద్దతుగా నిలవాలని డాక్టర్ లక్ష్మణ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్, బీజేపీ రాష్ట్ర మీడియా సెల్ కన్వీనర్ లింగాల హరిగౌడ్, అధికార ప్రతినిధి ప్రకాష్‌రెడ్డి, నాయకులు ప్రసాద్‌రావు పటేల్ బప్పు, రాంకోటేశ్వర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు సందడి సురేందర్‌రెడ్డి, గౌర దేవేందర్, డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్ పటేల్ పాల్గొన్నారు.

ముంపు సమస్య నివారణకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి

● ఎస్ఎన్‌డీపీ నాలాల నిర్మాణంతో సమస్యకు చెక్: సబితారెడ్డి



ఎస్ఎన్‌డీపీ నాలా పనులను పరిశీలిస్తున్న సబితారెడ్డి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు ప్రాంతాలతో పాటు మహేశ్వరం నియోజకవర్గంలోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లోని కాలనీల్లో వరద ముంపు నివారణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చెక్ పెట్టే దిశలో ఎస్ఎన్‌డీపీ నాలాల నిర్మాణ పనులు చేపట్టిందని ఆమె పేర్కొన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ 1వ డివిజన్‌లోని వరలక్ష్మీనగర్, సాయిబాలాజీనగర్, సాయికృష్ణా ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ నాలాల నిర్మాణ పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నాలా నిర్మాణ పనుల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. పనుల్లో ఎడతెగని జాప్యం జరుగుతున్నదని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పని చేసి నాలాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్లగంటి అర్జున్, కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, భీమిడి స్వప్నా జంగారెడ్డి, సంరెడ్డి స్వప్నావెంకట్‌రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'ఎంవీఎస్ఆర్'లో డ్యాప్‌కామ్-24 సదస్సు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలంలోని నాదర్‌గుల్‌లో గల ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో 'డేటా అక్విజిషన్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్-2024'(డ్యాప్‌కామ్-24) అనే అంశంపై మూడు రోజుల పాటు జరుగనున్న అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యాప్‌కామ్‌పై ఏర్పాటు చేసిన సదస్సు అటు విద్యార్థులకు, ఇటు అధ్యాపకులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. జ్ఞాన సముపార్జనలో ఇలాంటి సదస్సులు ఎంతగానో తోడ్పడతాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాతృశ్రీ విద్యా సంస్థల చైర్మన్ కేవీఆర్ కశ్యప్, కార్యదర్శి కేవీ శ్రీనివాస్‌రావు, ఎంవీఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కనకదుర్గ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీఎస్ మూర్తి, సదస్సు చైర్ పర్సన్ ప్రొఫెసర్ ప్రసన్నకుమార్, సంధ్య, రాజేశ్‌కులకర్ణి, శిరీష, హెచ్‌వోడీలు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఈ సదస్సుకు వివిధ దేశాలకు చెందిన అనేక మంది రచయితలు, వక్తలు హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు.

బాలాపూర్ స్కూల్‌లో యోగా విజ్ఞాన శిబిరం ప్రారంభం



యోగా శిబిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

సరూర్‌నగర్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి) : బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ జడ్పీ హైస్కూల్ ఆవరణలో శ్రీసత్యసాయి సేవా సంస్థ సౌజన్యంతో ఆచార్య రమేశ్ గురూజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'సంస్కార వికాస సాధన-యోగా విజ్ఞాన శిబిరం'ను గురువారం మేయర్ చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డి ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగాను తప్పనిసరి దినచర్యగా మార్చుకోవాలని, దాని ద్వారా సంపూర్ణ మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు జి.చెన్నకేశవరెడ్డి, గోవర్ధన్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీసత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులు గంగ, యాదగిరి రావు, రమాదేవి, బ్రిజేశ్, చైతన్యకుమార్, భూషణ్ పురోహిత్, రవికుమార్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలు నశించాలి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలు నశించాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో నాగోల్‌లోని నవచేతన విజ్ఞాన సమితి గిరిప్రసాద్ భవన్‌లో ఏర్పాటు చేసిన క్యాడర్ క్లాస్‌లు బుధవారం ప్రారంభమయ్యాయి. జంగయ్య మాట్లాడుతూ నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన పది సంవత్సరాల కాలంలో శాస్త్రీయ విద్యా విధానాన్ని మార్చివేసి మతపరమైన వాటిని పాఠ్యపుస్తకాల్లో చేర్చి సమాజానికి ఏమాత్రం ఉపయోగపడని భావజాలాన్ని పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గ్యార క్రాంతి, పి.శివ, సీపీఐ రాష్ట్ర సమితి నాయకులు పానుగంటి పర్వతాలు, యాదిరెడ్డి, సామిడి శేఖర్‌రెడ్డి, బాతరాజు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్టీసీ కార్మికులకు పీఆర్‌సీ ప్రకటించాలి'

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. 2013 పీఆర్‌సీ బాండ్స్ ఏరియర్స్ 50 శాతం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని, 2017 పీఆర్‌సీ 30శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని కోరారు. డిపోల్లో సంక్షేమ మండళ్లను రద్దు చేసి యూనియన్‌ల కార్యకలాపాలకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించాలి

● ఎన్‌టీఆర్‌నగర్ బస్తీవాసుల ఆందోళన

ఎల్బీనగర్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్ బస్తీలో ఇళ్ల స్థలాలను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ బస్తీవాసులు గురువారం ఎన్‌టీఆర్‌నగర్‌లోని చింతచెట్ల వద్ద బస్తీ వాసులతో కలిసి ది అర్బన్ హట్స్ స్లమ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జంటనగరాల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ దశాబ్దాలుగా ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరిస్తామని అన్ని రాజకీయ పార్టీలు హామీలు ఇచ్చినప్పటికీ నేటికి క్రమబద్ధీకరణకు నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్‌నగర్ బస్తీవాసులు సామల చంద్రయ్య, శంకర్ మహారాజు, పోచయ్య, యాదయ్య మహ్మద్ అజీమ్, చింతల శోభారాణి, ఎండీ రియాజ్, సయ్యద్ అజీజ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో నవజాత శిశువు లభ్యం

సైదాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన మగ శిశువును గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని ఇద్దరు మహిళలు చంచల్‌గూడ శ్మశానవాటిక ఆవరణలో పడవేసి పారిపోయారు. గమనించిన స్థానికులు శిశువును అక్కున చేర్చుకుని మాదన్నపేట పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని స్థానికులతో కలిసి శిశువును మలక్‌పేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యం నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. ఘటనపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చింతలకుంటలో కారు బీభత్సం

● పలువురికి స్వల్ప గాయాలు

వనస్థలిపురం, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): అతివేగంతో దూసుకవచ్చిన కారు రోడ్డు డివైడర్‌ను ఢీకొని.. డివైడర్ మధ్యలో ఉన్న స్ట్రీట్ లైట్ స్తంభాన్ని ఢీకొట్టగా పలువురికి స్వల్ప గాయాలైన సంఘటన గురువారం వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొందరు వ్యక్తులు గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వైపు సెల్ఫ్ డ్రైవింగ్ చేసుకుంటు కారులో అతివేగంగా వెళ్తున్నారు. చింతలకుంటలోని పల్లవి గార్డెన్స్ వద్దకు రాగానే అతివేగంతో వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో డివైడర్ మధ్యలో ఉన్న స్ట్రీట్ లైట్ స్తంభం కిందపడిపోగా, కారు నుజ్జునుజ్జు అయింది. ఆ సమయంలో రోడ్డుపై ట్రాఫిక్ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలు కావడంతో సమీపంలోని ఆస్పత్రికి వెళ్లారని స్థానికులు తెలిపారు. కాగా ఈ విషయంపై పోలీసుల వివరణ కోరగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పంచాయతీ పరిధిలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో అనారోగ్యంతో మృతి చెందిన ఓ వృద్ధురాలి అంత్యక్రియలను సురక్ష సేవా సంఘం ప్రతినిధులు నిర్వహించారు. కాలనీలోని 73వ బ్లాక్‌లో కొంత కాలంగా కొప్పులూరీ లలితమ్మ(70) నివసిస్తోంది. ఐదు నెలల క్రితం వికలాంగురాలైన లలితమ్మ కూతురు మృతి చెందింది. అప్పటి నుంచి లలితమ్మ ఒంటరి అయింది. కూతురు మరణించినప్పటి నుంచి లలితమ్మ వృద్ధాప్యంతో పాటు అనారోగ్యానికి గురైంది. కాగా గురువారం ఆమె తన ఇంట్లో మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న సురక్షసేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిక్కెర గోపీశంకర్‌యాదవ్ సంఘం ప్రతినిధులతో కలిసి కాలనీలోని శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలను నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కస్తూరి రమేష్, నాగవల్లి యాదగిరి, యాకూబ్, శ్రీనివాస్, సహదేవ్, రవినాయక్, హాజీ, కాలనీవాసులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో నిందితుడికి ఏడాది జైలు

రంగారెడ్డి కోర్టులు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపుల కేసులో నిందితుడికి ఏడాది జైలుశిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పును వెలవరించింది. సరిత అనే మహిళకు సోమయాజులు అనే వ్యక్తితో 1999లో విజయవాడలో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ. 5లక్షల కట్నం, ఆడపడుచు లాంఛనాలు, ఇతర కానుకలు ఇచ్చారు. కొంతకాలం నుంచి భర్త, అత్త, ఆడపడుచు కలిసి సరితను అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించారు. దాంతో బాధితురాలు సరిత 2020 జనవరి 24న సరూర్‌నగర్ మహిళా పోలీస్ స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణ చేసిన మూడవ సహాయ మెజిస్ట్రేట్ రవి నిందితుడు సోమయాజులుకు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు.